క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ విష్ణునారాయణ



వెలుగోడు: స్థానిక ఎస్‌ఐగా విష్ణు నారాయణ శుక్రవాం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌ఎస్‌పీలో ఉన్న ఆయనను పది రోజుల క్రితం మహానంది పోలీసు స్టేషన్‌కు బదిలీ చేసిన జిల్లా ఉన్నతాధికారులు అంతలోనే వెలుగోడుకు, ఇక్కడి ఎస్‌ఐ భూపాలుడును రేవనూరుకు బదిలీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ విష్ణునారాయణను రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు.

ఘనంగా మౌలాలిస్వామి సరిగెత్తు



మౌలాలిస్వామి ఊరేగింపు దృశ్యం

పాములపాడు: మండల కేంద్రంలో మౌలాలి స్వామి సరిగెత్తును ఘనంగా నిర్వహించుకున్నారు. రెండు రోజులుగా జరుగుతున్న వేడుకలు శుక్రవారం పెద్ద సరిగెత్తుతో ముగిశాయి. డప్పు వాయిద్యాలతో గ్రామం హోరెత్తింది. స్వామి వారి అగ్నిప్రవేశం అనంతరం గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ఫాతెహాలు అందుకున్నారు. అంతకు ముందు భక్తులు కందుర్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూల షేరాలు, దట్టీలు, కాయ కర్పూరాలు సమర్పించి దర్శించుకున్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ సురేష్ బాబు బందోబస్తు చర్యలు చేపట్టారు.

వాహనాల తనిఖీ



ద్విచక్రవాహనం దారునికి జరిమానా విధిస్తున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా: స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట కేజీ రోడ్డుపై ఎస్‌ఐ లక్ష్మీనారాయణ శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు పాటించని 8 వాహనాల దారులకు రూ.2,600 జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాల దారులు, ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్లలోపు వారికి వాహనాలు ఇస్తే సంబంధిత వాహనదారునిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు



మాట్లాడుతున్న డీఈఈ శ్రీనివాసులు

నందికొట్కూరు: వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు చేసినట్లు విద్యుత్ శాఖ డివిజనల్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ శనివారం నుంచి నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, జూపాడు బంగ్లా మండలాల్లో వ్యవసాయానికి గ్రూపు-(ఎ) మొదటి భాగంలో ఉదయం 4 నుంచి 10 గంటల వరకు, రాత్రి 9 నుంచి తెల్లవారుజామున 12 గంటల వరకు గ్రూపు-(బీ) రెండో భాగంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, రాత్రి 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయనున్నామన్నారు. మిగతా సమయాల్లో సింగిల్ ఫేజ్ కరెంట్ నిరంతరాయంగా సరఫరా అవుతుందన్నారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

రైతులకు రాయితీపై స్ప్రింక్లర్లు

ఆత్మకూరు: ఏపీ సూక్ష్మనీటి సాగుపథకం (ఏపీఎంఐపీ) ద్వారా రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్ పైపులు, డ్రిప్ సరఫరా చేస్తున్నట్లు మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారిణి మల్లేశ్వరమ్మ తెలిపారు. డ్రిప్ పరికరాలు ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీ, ఐదు ఎకరాలు పైబడి ఉన్న రైతులకు 70 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులకు ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రేపు సున్నిపెంటలో ఉచిత కంటివైద్య శిబిరం

శ్రీశైలంప్రాజెక్ట్: శాంతిరాం కంటి వైద్యశాల డాక్టర్ల సహకారంతో ఈనెల 18న సున్నిపెంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నాయకులు ఎంఏ జావేద్, ఎస్‌కే నజీర్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండ్లకమ్మా.. పూడికతీత ఎప్పుడమ్మా?

- పూడికతో నిండిన గుండ్లకమ్మ వాగు
- ఏటా ముంపునకు గురవుతున్న పలు కాలనీలు
- పట్టించుకోని అధికారులు

వర్షాకాలం వచ్చిందంటే ఆత్మకూరు పట్టణంలోని పదికి పైగా కాలనీలు గజగజ వణికిపోతాయి. మేఘావృతమైతే చాలు ఆకాశం వైపు చూస్తూ వర్షమా కురవకే అంటూ ఆయా కాలనీల వాసులు మనసులోనే ప్రార్థించుకుంటారు. అంతలా భయపడటానికి ప్రధాన కారణం సమీపంలోని గుండ్లకమ్మ వాగు. వాగులోని కొంతభాగం ఆక్రమణకు గురికావడం.. మిగిలినదాంట్లో పూడిక పేరుకు పోవడంతో ఒకరకమైన వర్షం వస్తే చాలు.. ఆయా కాలనీలు ముంపునకు గురై సర్వం కోల్పోతుండటమే. వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా.. ఈ ఏడాది ఇంకా పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో ఆయా కాలనీల వాసులు భయంభయంగా కాలం గడుపుతున్నారు.



పూడికతో నిండి ఉన్న గుండ్లకమ్మ వాగు

ఆత్మకూరు: గుండ్లకమ్మ వాగు ఆత్మకూరు శివారులో ప్రారంభమై పట్టణంలో దాదాపు 2 కిలోమీటర్లు ప్రవహిస్తూ భవనాసి నదిలో కలుస్తుంది. గతంలో ఈ వాగు ఎంతో విశాలంగా ఉండేది. ఇరువైపులా కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టడంతో ప్రస్తుతం వాగు రూపురేఖలే కోల్పోయింది. కొన్ని చోట్ల వాగుకు అడ్డంగా నిర్మాణాలు చేపట్టడంతో పూడిక పేరుకుపోయింది. వర్షాకాలంలో ఒక మోస్తరు వర్షం కురిసినా లక్ష్మీనగర్, రహమత్‌నగర్, ఎరకలపేట, సాయిబాబా నగర్, గరీబ్ నగర్ తదితర కాలనీలు జలమయమవుతాయి. ఆయా కాలనీల వాసులు కట్టుబట్టలతో ఇళ్లను వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. ఏటా తూతూ మంత్రంగా పూడిక తీత పనులు చేపట్టి వర్షపు నీరు పారే విధంగా చేసే అధికారులు ఈ ఏడాది కనీస ఆ పనులు కూడా చేపట్టలేదు. దీంతో ఇటీవల కురిసిన అడపాదడపా వర్షాలకు సైతం కాలనీలలోకి వర్షపు నీరు వచ్చి చేరింది.

రెండేళ్లత క్రితం నాటి పీడకల..

వాస్తవానికి నల్లమల అటవీప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురవడం సాధారణం. ఈ కాలంలో ఎప్పుడు భారీ వర్షం కురుస్తుందో, ఎప్పుడు వాగులు పొంగి ప్రవహిస్తాయో తెలియని పరిస్థితి. వర్షం వచ్చిన ప్రతి సారి అంతోఇంతో నష్టపోతూనే



ఇటీవల కురిసిన వర్షానికి నీట మునిగిన కాలనీ



కర్నూలు - గుంటూరు ప్రధానరహదారి వరదకు గురైన దృశ్యం (ఫైల్)

ఉన్నారు. 20 ఏళ్లకు పైగా ఆయా కాలనీల ప్రజలు వరదనీటి ప్రవాహంతో యుద్ధం చేస్తూనే ఉన్నారు. అయితే రెండేళ్ల క్రితం ఊహించని విధంగా భారీ వర్షాలకు గుండ్లకమ్మ పొంగి ప్రవహించడంతో దాదాపు 10 కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి సైతం ముంపునకు గురైంది. మార్కెట్‌యార్డ్ తదితర ప్రాంతాల్లోనూ నడుము లోతు వరద నీరు నిండి జలమయమైంది. వందల కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. దీంతో నీరు కాలనీలల్లోకి రాకుండా ముందుకు పారే విధంగా ఏటా పూడిక తీత పనులు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. గత రెండేళ్ల పూడిక తీసిన అధికారులు ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనా పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండుమూడు సార్లు కాలనీల్లోకి వర్షపు నీరు వచ్చి ధాన్యం తదితర సామగ్రి తడిసి నష్టం వాటిల్లిందని, భారీ వర్షాలు వస్తే మాత్రం సర్వం కోల్పోయి నిరాశ్రయులు కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భయంభయంగా..

వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తోంది. మరో రెండు నెలలు తుఫానుల కాలం. ఎప్పుడు భారీ వర్షం పడుతుందో.. గుండ్లకమ్మ వాగు ఎప్పు డు పొంగిపొర్లుతుందోనని ప్రజలు భయంభయంగా కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గుండ్లకమ్మ వాగులో పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంది.

పూడికతీత పనులు ప్రారంభించాలి



గుండ్లకమ్మ వాగులో అధికారులు ఇప్పటికైనా పూడికతీత పనులు చేపట్టాలి. మొన్న కురిసిన వానకే మా గరీబ్‌నగర్ కాలనీ ముంపునకు గురైంది. ఇంట్లో ఉన్న సామాన్లన్నీ నీటిలో కొట్టుకుపోయాయి. తిండి గింజలన్నీ నీళ్లపాలయ్యాయి. ఈసారి పెద్ద వాన కనుక వస్తే సర్వం కోల్పోవాల్సి వస్తుంది.

– రబ్బాని, ఆత్మకూరు

వర్షం నీళ్లు నిలబడకుండా చూడాలి



వాన కాలం ఇంకా రెండు నెలలు ఉంది. పెద్ద వానలు వచ్చే అవకాశం ఉంది. అంతలోపు గుండ్లకమ్మవాగులో పూడికతీత పనులు చేపట్టి నీళ్లు నిల్వ ఉండకుండా చూడాలి. అధికారులు పట్టించుకోకపోతే ఈ ఏడాది కూడా వరద ముంపుకు గురికాక తప్పదు.

– మల్లికార్జున, ఆత్మకూరు

పూడిక తొలగిస్తాం



అధిక వర్షాలు కురిసినప్పుడు గుండ్లకమ్మ వాగు కొన్ని కాలనీలను ముంచెత్తుతుంది. నీరు ముందుకు పోకుండా పూడిక చేరుకోవడం వల్ల ఈ పరిస్థితి వస్తోంది. పూడికతీత పనులు చేపట్టి కాలనీలు నీట మునగకుండా చర్యలు తీసుకుంటాం.

– హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

వరములివ్వమ్మా.. వరలక్ష్మీ తల్లీ!



మిడుతూరు: వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు: వరలక్ష్మీ పూజలను శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెల్లవారుజామునే తలంటు పున్యస్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి వరలక్ష్మీ వ్రతాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా కలశాన్ని నెలకొల్పి లక్ష్మీదేవి ముఖాన్ని తీర్చిదిద్ది దానిపై కొబ్బరికాయ ఉంచారు. అనంతరం లక్ష్మీదేవిని కలశంలోకి ఆహ్వానింపజేసి వ్రత విధానంతో పూజించారు. పిండివంటలు, పండ్లను నివేదించి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ఇవ్వాలని వేడుకున్నారు. ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఆత్మకూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శివాలయాల్లో పార్వతీదేవిని ప్రత్యేకంగా అలంకరించి మొక్కులు చెల్లించుకున్నారు.

పాములపాడు: మండలంలో ప్రజలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.



పాములపాడు: పూజలో పాల్గొన్న జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి దంపతులు

అమ్మవారిని నూతన వస్త్రాలు, గాజులు, పసుపు, కుంకుమలతో అలంకరించారు. గణపతి పూజ, అమ్మ వారికి కలశ స్థాపన, ముత్తైదువులకు పసుపు, కుంకుమలతో సారె అందజేశారు. తుమ్మలూరు గ్రామంలో జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి దంపతులు వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.

మిడుతూరు: మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం విశిష్టతను వివరించారు.



ఆత్మకూరులో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం



ఇంటిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

పులికాదు.. ఆందోళన వద్దు



నీటికుంటల వద్ద పరిశీలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

– ఆత్మకూరు ఎఫ్‌ఎస్‌ఓ జ్యోతి స్వరూప్

కొత్తపల్లి: ఎదురుపాడు గ్రామ సమీపంలోని పొలాల్లో గురువారం కనిపించిన పాద ముద్రలు పులివి కాదని, రైతులు భయపడాల్సిన పని లేదని ఆత్మకూరు ఎఫ్‌ఎస్‌ఓ జ్యోతి స్వరూప్ స్పష్టం చేశారు. 10 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి, 20 సిబ్బందితో గాలించినా ఎక్కడా పులి పాద ముద్రలు లభ్యం కాలేదన్నారు. గురువారం రైతులు చూపించిన పాద ముద్రలు కూడా పులి పాదముద్రలు కావని, రైతులను భయభ్రాంతులకు గురి చేసేందుకు ఎవరో కావాలని చేతితో పులి పాద ముద్రలాగా గుర్తు వేశారని తెలిపారు. ఇలాంటి పనికి పాల్పడింది ఎవరనే కోణంలోనూ ఆరా తీస్తున్నామన్నారు.



ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలు

నిందితులను కఠినంగా శిక్షించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

నందికొట్కూరు: కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం తాలూకా గౌరవ అధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో నిందులను శిక్షించాలంటూ ప్లకార్డులు పట్టుకుని నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వనజ, అనురాధ, మీనాక్షి, గీతారాణి, నాగరాజు, కుమార్, మహమ్మద్‌బాషా, శ్రీనివాసులు, మల్లయ్య పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

పాములపాడు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఏపీఓ విమలమ్మను శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీక్రిష్ణ, ఏఓ కరుణసాగర్, జేఈ రాఘవేంద్రప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ అబ్దుల్‌కలాం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డీటీకి అభినందనలు

జూపాడుబంగ్లా: స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఉత్తమసేవా అవార్డు పొందిన డిప్యూటీ తహసీల్దార్ నాగన్నను తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఆర్‌ఐ శ్రీరంగారెడ్డి, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం అభినందించారు.

తపాలా శాఖ సేవలపై కళాజాతా

నందికొట్కూరు: తపాలా శాఖ అందిస్తున్న సేవలపై శుక్రవారం పటేల్ సెంటర్‌లో కళాజాత బృందం ఆట పాటలతో ప్రజలకు అవగాహన కల్పించింది. పోస్టల్ సేవింగ్ ఖాతాలు, డిపాజిట్స్, సుకన్య సమృద్ధి యోజన, జన సురక్ష స్కీం, బీమా స్కీములు, యాక్సిండెంట్ బీమా(టాటా ఏఐజీ), గ్రామీణ తపాలా బీమా, పీఎం బీజేవై, ఎంఎస్‌బీఐ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కళాజాతా బందం కోరింది. కార్యక్రమంలో హెడ్ పోస్ట్‌మాస్టర్ ఖాజా మొహిద్దీన్, బజార్ శాఖ పోస్ట్‌మాస్టర్ సాయికృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బావుల చుట్టూ రక్షణ గోడలను నిర్మించాలి

ఆత్మకూరు: పట్టణంలో ఉన్న బావుల చుట్టూ రక్షణ గోడలను ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. రక్షణ గోడ లేని బావిలో ఓ యువకుడు ఇటీవల అనుమానాస్పదంగా పడి మృతిచెందాడని, మరిన్ని ఘటనలు చోటుచేసుకోక ముందే బావులకు రక్షణ గోడలు నిర్మించాలని వారు కోరారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.

అలరించిన భజన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై శుక్రవారం మహానంది మండలానికి చెందిన ఎస్.మధుచందర్ బృందం నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయల సేవ నిర్వహించారు. ముందుగా సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి కూడా విశేష పూజలు నిర్వహించారు.

నేడు ప్రైవేట్ ఆసుపత్రుల బంద్

ఆత్మకూరు రూరల్: కోల్‌కతాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రెయినా డాక్టర్‌పై జరిగిన హత్యాచారం, హత్యను నిరసిస్తూ ఆత్మకూరులోని ప్రైవేవేట్ ఆసుపత్రులు శనివారం బంద్ పాటించనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ గోవింద రాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర కేసులకు మినహాయింపు ఉంటుందన్నారు.

విద్యార్థినుల భద్రతకు చర్యలు

- జడ్జి ఇందిరప్రియదర్శిని



విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి ఇందిరప్రియదర్శిని

జూపాడుబంగ్లా: విద్యార్థినుల భద్రతకు చర్యలు తీసుకుంటామని నందికొట్కూరు సీనియర్ సివిల్‌జడ్జి ఇందిరాప్రియదర్శి హామీ ఇచ్చారు. శుక్రవారం ఆమె స్థానిక కేజీబీవీని తనిఖీ చేసి అందుతున్న విద్యాబోధన, పౌష్టికాహారం, సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అన్ని విద్యాసంస్థలు ఒకే చోట ఉండటంతో విద్యార్థినులు తరచూ ఈవ్‌టీజింగ్‌కు గురవుతున్నారని, పోటీస్ ప్రొటెక్షన్ కల్పించాలని టీచర్లు జడ్జి దృష్టికి తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించారు. జడ్జి వెంట ఎస్‌ఓ యశోద, లోక్‌అదాలత్ క్లర్క్ ఉమాదేవి ఉన్నారు.

సింగరాజు పల్లెలో అంధకారం

- వీధిదీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు



చీకట్లో సింగరాజు పల్లె

కొత్తపల్లి: కొన్ని రోజులుగా వీధిదీపాలు వెలగకపోవడంతో మండలంలోని సింగరాజుపల్లెలో అంధకారం నెలకొంది. దీంతో చీకటి పడిన తర్వాత ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఇటీవల వర్షాలు పడటంతో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. చీకట్లో రోడ్ల విషసర్పాలు సైతం తిరుగాడుతుంటాయి. వారం రోజులుగా వీధిదీపాలకు సరఫరా లేదనే విషయాన్ని జేఎల్‌ఎంకు ఫోన్ చేసి చెప్పినా స్పందన లేదని గ్రామస్తులు రామసుబ్బారెడ్డి, అంకిరెడ్డి, కుమ్మరి క్రిష్ణయ్య, బి.రామ చంద్రారెడ్డి ఆరోపించారు. ఇప్పటికైనా వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అధిక దిగుబడులు సాధించాలి

- ఏడీఏ ఆంజనేయ



పొలం వరి నాటు వేస్తున్న అధికారులు, రైతులు

పాములపాడు: తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని వేంపెంట పరిధిలో సాగైన వరి పైరులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతు క్షేత్రంలో భూసార పరీక్షలు చేయించారు. వరి నారు కట్టలను సూడోమోనాస్ ద్రావణంలో వేర్లను 15 నిమిషాలు ఉంచి నాటుకోవడం వల్ల తెగుళ్లను నివారించుకోవచ్చని సూచించారు. వరి కోనల్లు శత్రుపురుగులు గుడ్లను పెడతాయి కాబట్టి వాటిని తుంచి పురుగులను నియంత్రించోవాలన్నారు. సుడిదోమ నివారణకు పురుగు మందులు, ఎరువులు చల్లుకోవడానికి వీలుగా కాలిబాటలు తీసుకోవాలని వివరించారు. ప్రకృతిలో భాగంగా ద్రువ జీవామృతం తయారీ విధానాన్ని రైతు సమక్షంలో చేసి చూపించారు. అంతకుముందు రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. రైతులతో పాటు కాసేపు వరి నాటు వేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ఫణీశ్వరరెడ్డి, హేమలతారెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల డీఎస్పీగా యుగంధర్‌బాబు



డీఎస్పీకి అభినందనలు తెలుపుతున్న సీఐ ఇస్మాయిల్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ డీఎస్పీగా యుగంధర్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐలు ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. డీఎస్పీ మాట్లాడుతూ గతంలో కర్నూలు, చిత్తూరు, వెస్ట్ గోదావరి జిల్లాల్లో విధులు నిర్వహించానన్నారు. భీమవరం డీఎస్పీగా వీఆర్‌లో ఉన్న తనని పోలీస్ ఉన్నతాధికారులు నంద్యాల డీఎస్పీగా బదిలీ చేశారని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ వంతు కృషి చేస్తానని చెప్పారు.

శ్రీశైలం పరిధిలో బ్లూ కోల్ట్స్ పెట్రోలింగ్

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్ర పవిత్రతను కాపాడేందుకు బ్లూ కోల్ట్స్ పెట్రోలింగ్ నిర్వహించడానికి దేవస్థానం, అటవీ శాఖ, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చర్యలు తీసుకోబోతున్నట్లు సీఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కొందరు అన్యమతస్తులు శ్రీశైలం – శిఖరేశ్వరం మధ్యలో ఉన్న నంది సర్కిల్ వద్ద మాంసాహారం తింటుండగా అక్కడి భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఇతర ధార్మిక సేవా సంస్థల వారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా శ్రీశైలం నుంచి శిఖరం వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు ఏర్పాటు చేసి, నిరంతర తనిఖీలు చేపడతామన్నారు. క్షేత్ర పరిధిలోకి మద్యం, మాంసాహార పదార్థాలు, తీసుకురాకూడదని సూచిక బోర్డుల ఏర్పాటుకు దేవస్థానం ఈఓను కోరామన్నారు. భక్తుల ప్రశాంతతో పాటు, వన్య ప్రాణుల మెరుగైన జీవనశైలికి కృషి చేస్తామన్నారు.